## శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి : ఎస్పీ

మహబూబాబాద్, జూన్ 30: ఉద్యోగ విరమణ తర్వాత శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ఇటీవల ఏఎస్సైగా పని చేసిన బేగ్ మహబూబాబాద్ ఎస్సైగా ఉద్యోగోన్నతి పొంది రిపోర్టు చేశారు. ఎస్సైగా ఉద్యోగ విరమణ పొందిన బేగ్‌ను ఆదివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ ఘనంగా సన్మానించి మాట్లాడారు. కానిస్టేబుల్‌గా పోలీస్‌శాఖలో ఉద్యోగంలో చేరి సుమారు 38 ఏళ్లపాటు విధులు నిర్వహించి ఎస్సై స్థాయి వరకు చేరుకోవడం గొప్ప విషయమన్నారు. ఇన్నాళ్లు సమాజ శ్రేయస్సు కోసం పని చేసిన బేగ్ ఇకపై కుటుంబ శ్రేయస్సు కోసం పాటుపడాలని, సమాజానికి తనవంతుగా సేవా కార్యక్రమాలు చేసేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ఈ వయసులో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని వివరించారు. అనంతరం ఎస్సై బేగ్‌కు జ్ఞాపిక అందజేశారు.

ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై బేగ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

బాలాజీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

## ఉద్యోగ విరమణ సహజం

**ఎమ్మెల్యే, విప్ రాంచంద్రునాయక్**

దంతాలపల్లి, జూన్ 30: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) బోడ బాలాజీనాయక్ ఉద్యోగ విరమణ చేయగా, మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన అభినందన సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత జిల్లా వైద్యాధికారి పీ కళావతీబాయి, ఎమ్మెల్యే కలిసి బాలాజీ దంపతులను శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి ప్రజలకు గుర్తుండిపోయేలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీందర్, ప్రసాద్, శ్రీనివాస్, వైద్యులు విజయరెడ్డి, నెహ్రూ, చైతన్య, కుటుంబ సభ్యులు కిరణ్, కిశోర్, నరేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాని ఎమ్మెలే పరామర్శ**

దంతాలపల్లి: మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన అక్కిరెడ్డి రామలింగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పరామర్శించారు. రామలింగారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. రమేశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నవీన్‌రెడ్డి, మల్లం శ్రీను, వెంకట్‌రెడ్డి, సురేందర్, మహిపాల్‌రెడ్డి, హరికృష్ణ ఉన్నారు.

## ‘రైతుకు భరోసా’ ఏదీ..?

- వానకాలం వ్యవసాయ పనులు ప్రారంభమైనా అందని పెట్టుబడి సాయం
- వడ్డీ వ్యాపారులు, బ్యాంకుల వద్దకు పరుగులు పెడుతున్న రైతన్నలు
- కేసీఆర్ ప్రభుత్వం సాగుకు ముందే అందించిన పెట్టుబడి సాయం
- కాంగ్రెస్ దొంగ హామీలపై అన్నదాతల ఆగ్రహం

డోర్నకల్, జూన్ 30: రాష్ట్రంలోని అన్నదాతలకు ‘రైతు భరోసా’ నేటికీ అందలేదు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. రైతన్నలు వ్యవసాయ పనుల్లో బీజీబీజీగా ఉన్నారు. అదును దాటితే విత్తనాలు నాటడం కష్టమే. ఈ సమయంలో రైతులు ప్రభుత్వం నుంచి వచ్చే పెట్టుబడి సాయం కోసం ఎదురు చుస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, దుక్కి దున్నుదామంటే చేతిలో రూపాయి లేక వడ్డీ వ్యాపారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయ పనులు చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం సాగుకు ముందే ఎకరానికి పెట్టుబడి సాయం, రైతుబంధు పథకం కింద రెండు విడుతలుగా ఎకారానికి రూ.10వేలు బ్యాంకు ఖాతాల్లో జమచేసేంది. రైతులు పెట్టుబడి సాయంతో వ్యవసాయం సాఫీగా చేసేవారు. కానీ రైతులకు మాయ మాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి రెండు విడుతలుగా రూ.15వేల అందిస్తామని నమ్మ బలికింది. దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ జూన్ నెల పూర్తికావస్తున్నా, వర్షాలు పడుతున్నా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం నేటికీ అందించలేదు.

రైతు భరోసా కింద వర్షాకాలం పంట సాగు పెట్టుబడికి ఎకారానికి రూ.7,500 ఇవ్వాలి కదా..? ఎప్పుడు ఇస్తారు..? అని రైతులు ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాపై ఎలాంటి ప్రకటన చేయడం లేదు. అసలు రైతు భరోసా ఇస్తారా..? లేదా..? అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. యాసంగికి సంబంధించిన పంట సాయం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందించలేదు. తప్పని పరిస్థితుల్లో అప్పులు చేయాల్సి వస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా అందించాలని రైతులు కోరుతున్నారు.

### ‘రైతు భరోసా’ వెంటనే అందించాలి

పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ రైతులకు రైతు భరోసా అందిస్తారో లేదో చెప్పాలి. ఈ పథకం కోసం ప్రతి రైతూ ఎదురు చుస్తున్నాడు. గత కేసీఆర్ ప్రభుత్వం పంట సాగుకు ముందే రైతు బంధు పథకం కింద రూ.10వేల పెట్టుబడి సాయం అందించారు. ప్రస్తుతం పెట్టుబడి సాయం అందక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు.

*–లింగనబోయిన అప్పారావు, రైతు, తోడేళ్లగూడెం*

### రైతులను పట్టించుకోని ప్రభుత్వం

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నేటికీ పంట సాగుకు పెట్టుబడి సాయం అందించలేదు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతున్నా రైతు భరోసా ఇవ్వకపోవడంతో వడ్డీ వ్యాపారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. కేసీఆర్ సార్ పంట సాగుకు ముందే రైతులు ఖాతాల్లో జమ చేశారు. నేటి వరకూ పంట సాగు డబ్బులు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో చెప్పాలి.

*–చెక్కల రవికుమార్, రైతు*

డోర్నకల్: రైతు వేదికలో మాట్లాడుతున్న మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు

## ‘రైతు భరోసా’పై అభిప్రాయాల సేకరణ

డోర్నకల్, జూన్ 30: రైతు భరోసా పథకంపై మన్నెగూడెం రైతు వేదికలో ఆదివారం వ్యవసాయ అధికారులు రైతుల అభిప్రాయాలను సేకరించారు. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలని తెలిపారు. 10–15 ఎకరాలున్న రైతులకు కూడా రైతు బంధు ఇవ్వాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కౌలు రైతులకు సైతం రైతు భరోసా పథకం, రైతు బీమా కూడా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు, అసిస్టెంట్ రిజిస్ట్రర్ శ్రీనుబాబు, పీఏసీఎస్ చైర్మన్ కొండపల్లి సీతారాంరెడ్డి, ఎంపీటీసీ విజయ్‌పాల్‌రెడ్డి, మండల ఏవో మురళీమోహన్, ఇన్‌స్పెక్టర్ అబ్జల్ యుద్దీన్, సీఈవో సతీశ్, ఏఈవోలు సుప్రజ, అవినాశ్, కర్ల, రైతులు పాల్గొన్నారు.

**రేపు నర్సింహులపేటలో..**

నర్సింహులపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో ఈ నెల 2న రైతు భరోసాపై రైతుల సలహాలు, సూచనలు తీసుకోనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సంపేట రాము అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ జనరల్ బాడీ సమావేశంతో పాటు రైతు భరోసాపై రైతుల సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొలని కోరారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలూనాయక్

డోర్నకల్, జూన్ 30: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి, దోమల నివారణా చర్యలు చేపట్టాలని ఎంపీపీ ధరంసోత్ బాలూనాయక్ అన్నారు. ఆదివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాలూనాయక్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యం, వ్యవసాయం, విద్యుత్, ఐసీడీఎస్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, పశు వైద్యశాఖ, రెవెన్యూ శాఖలపై సమీక్ష జరిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాకాలం సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు ఫాగింగ్ చేసి దోమ లార్వాను నివారించాలన్నారు. రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా పథకం కింద ఎకారానికి రెండు విడుతలు రూ.15 వేల పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, రైతులు కరెంట్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, విద్యుత్ శాఖ ఏఈ కిరణ్ దృష్టికి తీసుకెళ్లారు. కరెంట్ సమస్య లుంటే తక్షణమే పరిష్కరించి, 24 గంటలు కరెంట్ ఇవ్వాలని కోరారు. రైతులకు ఎంఆర్‌పీకే విత్తనాలు అందజేయాలని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, జడ్పీటీసీ పొడిశెట్టి కమల, డీటీ వీరన్న, ఎంపీవో మీర్జా మున్వర్‌బేగ్, ఎంపీటీసీలు నున్న మల్లికార్జున్, బానోత్ శంకర్‌కోటి, సీడీపీవో ఎల్లమ్మ, ఏవో మురళీమోహన్, పీఆర్ ఏఈ అలీ, ఏపీఎం శంకర్, పశువైద్యాధికారి సురేశ్‌కుమార్, సీహెచ్‌వో వీరబాబు పాల్గొన్నారు.

## మద్యం తాగి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడిపై విచారణ

కొత్తగూడ, జూన్ 30: మండలంలోని కొత్తపల్లి గిరిజన ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఈక నారాయణ పాఠశాలకు మద్యం తాగి వచ్చాడని గ్రామస్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు విచారణ చేయాలని స్కూల్ కాంప్లెక్ ప్రధానోపాధ్యాయుడు దాసును ఆదేశించారు. ఆదివారం హెచ్‌ఎం దాసు ఈ ఘటనపై విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

## లంబాడా ఐక్య వేదిక అసెంబ్లీ సెక్రటరీగా రామ్మూర్తినాయక్

మహబూబాబాద్ రూరల్, జూన్ 30: లంబాడా ఐక్య వేదిక డోర్నకల్ అసెంబ్లీ సెక్రటరీగా తేజావత్ రామ్మూర్తినాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ గుగులోత్ రమేశ్ నాయక్ నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామ్మూర్తికి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

## 4న నర్సింహులపేట మండల సభ

నర్సింహులపేట, జూన్ 30: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 4న ఎంపీపీ టేకుల సుశీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీను ఆదివారం తెలిపారు. చివరి సమావేశమైనందున అన్ని గ్రామాల ఎంపీటీసీలు, అన్ని శాఖాల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని సూచించారు.

## ‘సీఎం మాటలు ప్రకటనలకే పరిమితం’

మహబూబాబాద్ రూరల్, జూన్ 30: సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యాయని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీశైలం, విష్ణువర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం అనేక మార్లు ఏ ఒక్క ప్రభుత్వ పాఠశాలను మూతపడనీయమని, మూసివేసిన వాటిని కూడా వెంటనే తెరిపిస్తామని సభల్లో చెప్పారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎస్‌జీటీ బదిలీల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో చాలా పాఠశాలల్లో ఖాళీలు చూపించడం లేదన్నారు. పదోన్నతుల్లో సైతం కొన్ని పాఠశాలల్లో నింపకుండా వదిలేశారన్నారు. గుట్టు చప్పుడు కాకుండా రేషనలైజేషన్ చేసేవిధంగా విద్యాశాఖ వ్యవహరించడం సరికాదన్నారు. అన్ని ఖాళీలను చూపించి బదిలీల అనంతరం మిగిలిన పోస్టులను ప్రత్యక్ష నియామకాలు చేపట్టాలని వారు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ పేమెంట్‌తో మోసం చేసిన యువకులను పట్టుకున్న గ్రామస్తులు

## ఆన్‌లైన్ పేమెంట్‌తో టోకరా..!

**పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు**

పెద్దవంగర, జూన్ 30: గ్రామాల్లోని మూడు కిరాణా షాపుల్లో వస్తువులు కొనుగోలు చేసి, ఆన్‌లైన్‌లో నగదును పేమెంట్ చేశామని చెప్పి షాపు యజమానులను కొందరు యువకులు మోసం చేసిన ఘటన ఆదివారం మండలంలోని గంట్లకుంట గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, షాపు యజమానులు పోలీసులకు సమాచారం అందించడంతో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని విచారించారు. జనగామ జిల్లా, కొడకండ్ల మండలం, కడగుట్ట తండాకు చెందిన భూక్యా యాకేశ్, భూక్యా నితిన్‌గా గుర్తించినట్లు తెలిపారు. షాపు యజమానుల నుంచి రూ.3,100 పేమెంట్ చేశామని చెప్పి బురిడి కొట్టించారన్నారు. పోలీసులు రావడంతో నగదును యువకులు వెంటనే అందించినట్లు షాపు నిర్వాహకులు పేర్కొన్నారు. బురిడితో టోకరా కొట్టిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## ‘ఎస్సీ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి’

చిన్నగూడూరు, జూన్ 30: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా బాధ్యుడు వీరబాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడారు. వార్డెన్ సమయపాలన పాటించడం లేదన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అం దించాలన్నారు. అద్దె గదుల్లో వసతి గృహం కొనసాగుతుండడంతో రాత్రి వేళల్లో విషసర్పాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు వసతి గృహాన్ని సందర్శించి సరైన సౌకర్యాలు కల్పించి, నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కరువు భత్యం ప్రకటించాలి

బయ్యారం, జూన్ 30: నాలుగు విడుతల కరువు భత్యాన్ని ప్రకటించాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ హనుమంత ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో రాంప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు పీఆర్‌సీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయాలని, కార్పొరేట్ దవాఖానల్లో సైతం వైద్యం అందించాలని, గ్రాడ్యూటీ రూ.25 లక్షలకు పెంచాలని కోరారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆర్‌వీ ప్రసాద్‌రావు, కార్యదర్శి శ్రీనివాస్, సత్తిరెడ్డి, కన్నయ్య, రమాదేవి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హనుమంత ప్రసాద్

## ఎస్సై బంధువులమంటూ ఇసుక రవాణా

చిన్నగూడూరు, జూన్ 30: మండల కేంద్రంలోని ఆకేరు వాగు నుంచి కురవి మండలానికి ఇసుక అక్రమంగా రవాణా కొనసాగుతున్నది. కొందరు ఎస్సై బంధువులమంటూ నిత్యం తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.‘ఆఫీసర్‌దందా అంటూ’ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో ఆదివారం వెలుగులోకి వచ్చింది. నిత్యం ఇసుక రవాణా జరుగుతోందని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్సై ఝాన్సీని వివరణ కోరగా.. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని, కొందరు కావాలనే తమ పేరు వాడుకుంటున్నారన్నారు. ఈ విషయం తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటానని తెలిపారు.



బీరిశెట్టిగూడెంలో బియ్యం అందిస్తున్న వీడీసీ సభ్యులు

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

దంతాలపల్లి, జూన్ 30: మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలకు గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) వ్యవస్థాపకుడు ఆజాద్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర వస్తువులు, ఆర్థిక సాయం అందజేశారు. ముత్తయ్య కుటుంబానికి 50 కిలోల బియ్యం, మైసయ్య కుటుంబానికి 50కిలోల బియ్యం, రాములు కుటుంబానికి 50కిలోల బియ్యం అందించారు. దాట్ల గ్రామంలో మృతి చెందిన సరోజన కుటుంబానికి పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రియుడి వేధింపులు తాళలేక.. భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

**భార్య మృతి.., ప్రాణాపాయ స్థితిలో భర్త**

నెల్లికుదురు, జూన్ 30: ప్రియుడి వేధింపులు భరించలేక భార్యాభర్తలు పురుగుల మందు తాగగా, భార్య మృతిచెందింది. భర్త దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన నెల్లికుదురు మండలంలో ఆదివారం జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. మండలంలోని మేచరాజుపల్లి శివారు పెద్దతండాకు చెందిన బానోత్ నీలమ్మ(36)తో అదే తండాకు చెందిన బానోత్ వీరన్నకు మధ్య వివాహేత సంబంధం కొనసాగుతున్నది. ఈ విషయంలో గతంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగగా, పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. వీరన్న మరోసారి నీలమ్మ జోలికి రావొద్దని తీర్మానం చేశారు. కానీ తన ప్రవర్తన మార్చుకోకుండా నీలమ్మను తనతో ఏకాంతంగా గడపాలని తరచూ వేధించేవాడు. ఈ నెల 29న నీలమ్మ ఇంటికి వీరన్న వచ్చి రాద్ధాంతం చేశాడు. తండాలో అసభ్యకరంగా ప్రచారం చేశాడు. దీంతో అవమానం భరించలేక నీలమ్మ, ఆమె భర్త భద్రు ఆదివారం ఉదయం పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా నీలమ్మ మృతి చెందింది. భద్రు చికిత్స పొందుతున్నాడు. మృతురాలి సోదరుడు కిషన్ ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఇండ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ధర్నా

కేసముద్రం,జూన్ 30: మండలంలోని మహమూద్‌పట్నం గ్రామంలో 2008లో పట్టాలు ఇచ్చిన బాధితులకు ఇండ్లు నిర్మించుకోవడానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఆదివారం మరో వర్గం బాధితులు తొర్రూరు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చినా కొందరు ఇండ్లు నిర్మించుకోలేదన్నారు. ఆర్థిక స్థోమత లేని కారణంగా ఇండ్లు నిర్మించుకోలేదని, తొలుత తమకే పట్టాలు ఇచ్చినందున ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నూనావత్ ధర్మ, నరేశ్, భూక్యా జమ్మి, మంగిలి, బుజ్జి, తారకి, సరోజ, రజిత, సువాలి, శాంతి పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : వెంకన్న

మహబూబాబాద్ రూరల్, జూన్ 30: మొక్కలు భావి తరాలకు ఎంతో దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ నాటాలని వన ప్రేమికుడు, హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న అన్నారు. పీఈటీగా ఉద్యోగ విరమణ పొందిన గుడెపల్లి నాగయ్యకు ఆదివారం పట్టణంలోని ప్రజా హృదయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మొక్క అందజేసి సన్మానించారు. వీరస్వామి, ఉప్పలయ్య, మల్య, ఆశయ్య పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలి

గార్ల, జూన్ 30: రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని ఏఐటీఎఫ్ రాష్ట్ర నాయకుడు జీ సక్రు అన్నారు. ఆదివారం చిన్న కిష్టాపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అడవులు, భూములు, సహజ వనరులను కాపాడుకోవాలన్నారు. రాజ్యాంగ చట్టాలను అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మీనారాయణ, రవి, పాపయ్య, కలమ్మ, రాధమ్మ, పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అపస్మారక స్థితిలో గుర్తు తెలియని మహిళ

మహబూబాబాద్ రూరల్, జూన్ 30: పట్టణ శివారులోని ఇల్లెందు– మహబూబాబాద్ జాతీయ రహదారి పక్కన ఓ మహిళ అపస్మారక స్థితిలో ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి మహిళను ఏరియా దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

## ఎస్‌జీటీ ఖాళీలను బదిలీల్లో చూపించాలి

**సీనియారిటీ జాబితా తప్పులను సవరించాలి**

మహబూబాబాద్ రూరల్, జూన్ 30: ఎస్‌జీటీ ఉపాధ్యాయ పోస్టులను బ్లాక్ చేసి చూపిస్తున్నారని, వాటిని వెంటనే బదిలీల్లో చూపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. రేషనలైజేషన్‌పై విధానపరమైన నిర్ణ యం తీసుకోకుండా, విద్యార్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన పాఠశాలలకు మాత్రం ఉపాధ్యాయులను విద్యాశాఖ కేటాయించలేదన్నారు. కోర్టు కేసులను సాకుగా చూపి వేల సంఖ్యలో ఉండే ఎస్‌జీటీ పోస్టులకు ఆప్షన్ గడువును కేవలం ఒక్క రోజు మాత్రమే ఇచ్చి ముగించడం సరికాదన్నారు. ఇప్పటికైనా తప్పులను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. షేక్ యాకూబ్, సంజీవ, రాజశేఖర్, హరినాయక్, సత్తార్ పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాలకు రెగ్యూలర్ అధ్యాపకులు

బయ్యారం, జూన్ 30: మండలంలోని నామాలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు నూతనంగా 22 మంది రెగ్యూలర్ అధ్యాపకులు నియామకం అయ్యారు. వారు జాయిన్ అయినట్లు ప్రిన్సిపాల్ కల్యాణం రవిబాబు ఆదివారం తెలిపారు. తెలంగాణ, బీహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, హర్యాణ, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వచ్చారని, 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి సోమవారం నుంచి తరగతులు ప్రారంభమైతాయని తెలిపారు.

నూతన అధ్యాపకులతో పాఠశాల ప్రిన్స్‌పాల్ రవిబాబు

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తొర్రూరు, జూన్ 30: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989–90 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. గురువులు హనుమాండ్ల రంగారెడ్డి, కిషన్‌రావు, సత్యారెడ్డి, లలితా, విజయలక్ష్మి, శ్రీనివాస్, రంగారెడ్డిని శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. పదో తరగతి విద్యార్థి సంఘాన్ని రిజిస్టర్ చేయించుకొని ప్రతి ఏడాది కార్యక్రమాలు కొనసాగిస్తామని కమిటీ నిర్వాహకులు తెలిపారు. కమిటీ నిర్వాహకులు కుర్ర శ్రీనివాస్, వజినపల్లి అనిల్‌కుమార్, డాక్టర్ ఎస్ నాగవాణి, సీహెచ్ రాము, డీ రాజు, నిమ్మల వెంకన్న, మారిపల్లి రాజు, రాంబాబు, జీ మంగయ్య, అలువాల సోమయ్య, మంగళపల్లి ఆశయ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## ‘ఎన్డీకి జిల్లా కార్యదర్శి పుల్లన్న రాజీనామా’

మహబూబాబాద్/ బయ్యారం, జూన్ 30: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ(చంద్రన్న) పార్టీ జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్న బయ్యారం మండలంలోని మిర్యాలపెంట గ్రామానికి చెందిన ఎస్ ముత్తయ్య అలియాస్ పుల్లన్న పార్టీ పదవి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆదదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులోని వివరాల ప్రకారం.. కామ్రేడ్స్ చంద్రన్న, అశోక్ పార్టీని నడుపుతున్న తీరును గమనించానని, బాగాలేదని, వారు అనుసరిస్తున్న పద్ధతులు సైతం విప్లవ ఉద్యమానికి నష్టం కలిగించేలా ఉన్నాయన్నారు. చంద్రన్న విప్లవ ప్రయోజనాలను గుర్తించకుండా వ్యక్తిగత ఎజెండాతో నడుస్తున్నాడని, ఇది తనకు నచ్చక రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. తాను యథావిధిగా సాధినేని వెంకటేశ్వర్‌రావు నాయకత్వంలో న్యూడెమోక్రసీ నిర్మాణంలో పని చేయాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు.

## జైకిసాన్ రైతు సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



కేసముద్రం, జూన్ 30: జైకిసాన్ రైతు పరపతి సంఘం మండల అధ్యక్షుడిగా కేసముద్రం విలేజ్ గ్రామానికి చెందిన సంకపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యాడు. ఆదివారం రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మూల భూలోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గండి శ్రీనివాస్, కోశాధికారిగా కొమ్మాల జహిందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా వంగాల కొమ్మాల్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా ముదిరెడ్డి అశోక్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సుధాకర్, నాగన్న, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.

NTW-318953

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557